


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

– ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



## తెనాలి రామకృష్ణ – 4

కవిపుత్రుడు మాధవుడు పలకపై 'వికటకవి" వ్రాసి –అమ్మా, బాగుంది. భలే బాగుంది.

తల్లి కమల: ఏవిఁట్రా సంబరం?

మాధవ: చూడు.

తల్లి: నా అదృష్టం కొద్దీ దొరికార్రా నాయనా. అబ్బకొడుకులిద్దరూను.

కొడుకు:ఔనమ్మా.

తల్లి: రాజాస్థానంలో ఆశ్రయం దొరక్కపోతే అందరం ఏ నదిలోనో మునగాల్సిందే.

మాధవ: నాన్నొస్తాడు. –కవి ప్రవేశం.

భార్య: వచ్చారా. ఆచార్యులవారి దర్శనం అయిందా? ఏమన్నారు? రాజాస్థానానికి ఎప్పుడు వెళ్తారు?

కొడుకు: నేనూ వస్తాను నాన్నా. గుర్రాలు,ఏనుగులు, పల్లకీలు. అన్నీ ఉంటాయిగా? రాజుగారు సింహాసనం మీద కూర్చుంటారా నాన్నా? సింహాలు రాజుగారిని కరవ్వూ?

కమల: ఏమిటి ఆలోచిస్తున్నారు?

కవి: మరేమీ లేదు. తలపాగా ఏమిటి చుడదామా అని? తగినట్లు ఉండాలిగా?

భార్య: సిద్ధంగానేవుంది. ఉండండి తెస్తాను. –లోనికి వెళ్ళి వస్త్రం తెస్తుంది.

కవి: ఏమిటిది కమలా? చీర తలకి చుట్టుకోమంటావా?

భార్య: చీర కాదు. మధుపర్కం. కట్టుకోండి. శుభం కలుగుతుంది.

కవి: అంతా దేవి నిర్ణయం. ఇవ్వు,–– ధరించి:మాధవా. ఇప్పుడెలా ఉన్నానా?

మాధవుడు: నా అంత ఎత్తున్నావు.

కవి: నవ్వుతూ (Fade out) ★★★

రాయలవారు దర్బారులో ప్రవేశం. –

పురొహితులు:: ఓం. రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే– నమో వయం వైశ్రవణాయ కుర్మహే। సమే కామాన్ కామకామాయ మహ్యం– కామేశ్వరో వైశ్రవణొ దదాతు। కుబేరాయ వైశ్రవణాయ మహారాజాయ నమః॥ శతమానం భవతి శతాయుః పురుషః । శతేన్ద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి ॥

రాజు ఆశీర్వచనాల మధ్య వెళ్లి ఎత్తయిన వేదికపై సింహాసనంపై ఆసీనుడౌతాడు.

శ్రీకృష్ణదేవరాయలు: "సామంతులారా!సామ్రాజ్య పౌరులారా! విదేశ ప్రతినిధులారా! విజయనగర సామ్రాజ్యాధీశ్వరులు సత్యము,ధర్మము,దయ తమ జీవితాశయాలుగా, కులమత భేదాలు లేకుండా ప్రజాపాలన సాగించారు. వారి అడుగుజాడల్లోనే మేమూ సంచరిస్తున్నాం. కాని బహమనీ సుల్తానులు మా ఆశయాలను అర్థం చేసుకోలేక మా అదృష్టం చూసి అసూయపడుతున్నారు. మా సామ్రాజ్య శాంతికి, ప్రజాక్షేమానికి భంగం కలిగించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలను మేమెన్నడూ సహించం. హద్దుమీరి ప్రవర్తిస్తే అవసరమైన చర్య తీసుకుని వారికి గుణపాఠం నేర్పడానికి వెనుదియ్యం. ఆ ప్రత్యక్షచర్య అనివార్యమైతే సామ్రాజ్య ప్రజలందరూ ఏకజాతిగా నిలిచి మా నిర్ణయం జయప్రదంగా కొనసాగిస్తారని ఆశిస్తున్నాం." జయజయధ్వానాలు. అంతలో ధర్మ గంట మ్రోగుతుంది.

మహామంత్రి తిమ్మరుసు: ఎవరది?

దౌవారికుడు: పురప్రజలు న్యాయం కోరుతున్నారు ప్రభూ.

మహామంత్రి: ప్రవేశపెట్టు. –ముగ్గురు పౌరులు ప్రవేశిస్తారు.

మహామంత్రి; ఏమిటి మీ విజ్ఞాపన?

వారిలో పెద్దవాడు: మా తండ్రిగారి మరణశాసనం ప్రకారం స్థిరాస్తి మాకు దక్కుతుంది. చరాస్తి పంచలేకపోతునారు మహాప్రభూ.

రాయలు: కారణం?

పెద్ద కొడుకు: మా తండ్రిగారి 17 ఏనుగుల్ని సగపాలు నాకు, మూడవపాలు రెండవ వాడికి, అందులో మూడవపాలు మూడవ వాడికీ రావాలి. ఈ పంపకం చెయ్యలేక వాటిని తమ గజశాలకు తోలేశారు. మాకు న్యాయం కలిగించండి మహాప్రభూ.

రాయలు: మా పాలనలో ఎన్నడూ అన్యాయం జరగనివ్వను. ఈ సమస్యను గురించి ధర్మాధికారుల అభిప్రాయం?

ధర్మా: ఎన్ని విధాలుగా భాగించి చూసినా జంతుహింస లేకుండా పాలుపంచడం సాధ్యంగా కనపడలేదు ప్రభూ.

తాతాచార్యులు: మరణించినవాడు మతిలేనివాడుకాదు మహాప్రభూ. ప్రతిభావంతుడైన ప్రభుభక్తి పరాయణుడు. కనుకనే సాధ్యం కానట్లు మరణశాసనం వ్రాశాడు. ఆయన అభిమతాన్ని మన్నించి ఆ ఏనుగులను తాము స్వీకరించడమే న్యాయం.

తెనాలి రామకృష్ణ కవి: కాదు. పరమ అన్యాయం. – మహామంత్రి ఆశ్చర్యంతో చూస్తాడు.: సత్యధర్మాలకు ఆలయమైన ప్రభువుల కొలువులో న్యాయమేకాని అన్యాయం జరగరాదు. ధర్మాధికారులు పంచలేక ప్రభుత్వాధీనం చేసుకోమనటం ధర్మంకాదు ప్రభూ.

మహామంత్రి: ఈ మహాసభ నిర్ణయాన్ని ఆక్షేపించేదెవరు?

రా.కృ. కవి : నేను——నిర్భయంగా ముందుకువచ్చి సభకీ, ప్రభువుకీ నమస్కరిస్తాడు.

మహామంత్రి: ఈ నేరానికి పరిహారం తెలుసా?

రా.కృ: తెలుసు.

మహామంత్రి: ఎవరు నువ్వు?

తాతాచార్యులు: ఎవరో పిచ్చివాడు.

కవి: కాదు మహాప్రభూ. తమ ఆశ్రితుణ్ణి.

మహామంత్రి: విజయనగర పౌరుడివేనా?

కవి: ప్రభువులు అనుగ్రహిస్తే ఔతాను. నియోగిబిడ్డను. ఎందుకు వినియోగించినా ఉపయోగపడతాను.

మహామంత్రి: ఈ సమస్యను పరిష్కరించగలవా?

కవి: ప్రభువుల సెలవైతే. –రాయలు మందహాసం చిందిస్తాడు. అంగీకారసూచకంగా శిరఃకంపం చేస్తాడు.

కవి: ఏనుగు బొమ్మలు తెప్పించండి.

మహామంత్రి: ఎవరయ్యా నువ్వు?

కవి: మాది కృష్ణాతీరం. తెనాలి. గార్లపాటి రామన్నమంత్రి కుమారుణ్ణి. రామకృష్ణుణ్ణి.——బల్లపై చూపిస్తూ——ఇవి పంచవలసిన 17 ఏనుగులు. శ్రీవారే భద్రగజాధిరూఢులై ఈ పంచడానికి వేంశారనుకోండి. మీ కభ్యంతరం ఉంటుందా? ఉండదు. శ్రీవారి ఏనుగును మీవాటిలో కలిపాననుకోండి. మీకభంతరం లేదుగా?

పెద్దకొడుకు: లేదు.

తాతా: చేర్చడానికి వీల్లేదు. పంచవలసినవి పదిహేడే.

కవి: పంచబడేవికూడా పదిహేడే స్వామీ. ఇప్పుడు వెరశి ఏనుగులెన్ని?

పౌరుడు: 17.

కవి: కాదు–18.ఇందులో పెద్దవాని సగపాలు 9 కదూ?

పెద్దవాడు: ఔను. –కవి 9 ఏనుగు బొమ్మలు వానికి ఇస్తాడు.

కవి: ఇక రెండవవాని మూడవ వంతు 6. –వానికీ బొమ్మలు ఇస్తాడు.——మూడవవాని పాలు2. –వానికీ ఇస్తాడు.——ఇక మిగిలింది శ్రీవారి ఏనుగు. ఇది వారిపాలు. ––రాయలు చిరునవ్వు. సభామంటపం దద్దరిల్లేటట్లు హర్షధ్వానాలు మారుమ్రోగుతాయి.

రాయలు: సెహబాస్ రామకృష్ణా. సెహబాస్! మీ బుద్ధిబలంవల్ల మా భువనవిజయం గౌరవం దక్కింది, మీరు సదా మా సభనలంకరించి మాకు ఆనందం కలిగించాలని మా కోరిక.

కవి: ధన్యుణ్ణి మహాప్రభో. నేటికి నా తపస్సు ఫలించింది.

నరసింహ కృష్ణరాయల । కరమరుదగు కీర్తివెలయు కరిభిత్ గిరిభిత్।
కరికరిభిత్ గిరిగిరిభిత్। కరిభిత్ గిరిభిత్తురంగ కమనీయంబై॥

పెద్దన: అద్భుతం! నీవు కవివికూడానా చిరంజీవీ? నీ తపస్సే కాదయ్యా. మా తపస్సుకూడా ఫలించింది.

మహామంత్రి: వారు ఆంధ్రకవితాపితామహులు అల్లసాని పెద్దన కవీంద్రులు.

తిమ్మన: యువకుడవైనా చక్కని పద్యం చెప్పావయ్యా.

పెద్దన: వీరు మధురకవి నంది తిమ్మన్నగారు.

రా.కృ.కవి:

మాకొలది జానపదులకు। నీ కవనపు తీరులబ్బునే కూపనట।
ధ్భేకములకు గగనధునీ ।శీకరముల చెమ్మ నంది సింగయతిమ్మా॥

రాయలు: బాగుబాగు. కాని “గగనధునీ” “నాకధునీ” ఐతే?

రా.కృ.కవి: ... ... కూపనట।
ధ్భేకములకు నాకధునీ శీకరముల చెమ్మ నంది సింగయతిమ్మా॥

ఆహాహా. ఇంకా రసవంతంగా ఉంటుంది మహాప్రభో. తమ మార్పు నానేర్పుకు ఘనత కలిగించింది. మహారాజకవికి ఈ కవి బహుమానం సమర్పిస్తున్నాడు. స్వీకరించండి. –తలపాగా తీసి పట్టుకుంటాడు. సభ నివ్వెరపోతుంది మహామంత్రితోసహా.

రాయలు నిర్ఘాంతపోయినా సర్దుకుని ఆమోదసూచకంగా తలపంకిస్తాడు. :"సరస్వతీ కటాక్షం".

మహామంత్రి ఆనందంగా: ఇది మీరు స్వీకరించండి. –పళ్ళెంతో వరహాలు కవికి సమర్పిస్తాడు. ––– రాయలు: ఇకనుండీ మీరు మా ఆంతరంగికులు. – కవికి శాలువా సన్మానం. సభలో జయజయధ్వానాలు.

(సశేషం)

COMMENTS